క్లుప్తంగా

ఆళ్ల నానిని కలిసిన పంతగాని వెంకన్న


ఆళ్ల నానిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పంతగాని వెంకన్న

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నానిని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పంతగాని వెంకన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మరింత కష్టపడి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పార్టీ అభ్యర్థుల విజయం కోసం నిరంతరం శ్రమించాలన్నారు. వెంకన్నతో పాటు ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధీర్ బాబు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు నల్లమిల్లి ఏసుపాదం, నాయకులు లక్కాబత్తుల వెంకటరమణ, జెట్టి సత్యనారాయణ, పొడపాటి రమేష్ తదితరులు ఉన్నారు.

అయోధ్యకు సైకిల్ యాత్ర


సైకిల్ యాత్రగా అయోధ్యకు వెళుతున్న రంగనాథం

ద్వారకాతిరుమల: తిరుమల తిరుపతికి చెందిన వృద్ధుడు పి.రంగనాథం ద్వారకాతిరుమల క్షేత్రం నుంచి ఆదివారం అయోధ్యకు సైకిల్ యాత్రగా పయనమయ్యారు. తిరుమల తిరుపతి నుంచి అయోధ్యకు చేపట్టిన ఈ యాత్ర శనివారం రాత్రి ద్వారకాతిరుమల క్షేత్రానికి చేరింది. ఈ సందర్భంగా ఉదయం స్వామి, అమ్మవార్లను రంగనాథం దర్శించుకున్నారు. అనంతరం సైకిల్‌పై అయోధ్యకు పయనమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 రోజుల క్రితం తిరుమల తిరుపతిలో సైకిల్ యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. 2018లో ఒకసారి సైకిల్ యాత్రగా అయోధ్యకు వెళ్లి, చుట్టుపక్కల క్షేత్రాలను సందర్శించినట్లు తెలిపారు. ఈసారి అయోధ్య తరువాత ద్వారకా క్షేత్రాన్ని సందర్శిస్తానని పేర్కొన్నారు.

పోలీసుల కవాతు


కొయ్యలగూడెంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, సీఐఎస్ఎఫ్ బృందం

కొయ్యలగూడెం: ఎన్నికల నేపథ్యంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కవాతు నిర్వహించారు. పోలవరం డీఎస్పీ ఎన్.సురేష్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సీఐ జి.మధుబాబు, ఎస్సై జీజే విష్ణువర్ధన్‌ల నేతృత్వాన జాతీయ ప్రధాన రహదారులపై కొయ్యలగూడెంలో కవాతు చేపట్టారు. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) బృందంలోని సభ్యులు పాల్గొనగా పోలీస్ అధికారులు ఎన్నికల విధివిధానాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున ప్రజలు అప్రమత్తతో వ్యవహరించాలని, అన్ని రాజకీయ పార్టీల వారు ఎన్నికల నియమావళిని అనుసరించాలన్నారు. సభలు, సమావేశాలకు అనుమతులు తప్పనిసరి తీసుకోవాలన్నారు. ప్రజలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. అపరిచితుల సమాచారాన్ని పోలీసు శాఖకు అందించాల్సిందిగా సూచనలు ఇచ్చారు.

వేణుగోపాలస్వామి కల్యాణం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని బుట్టాయగూడెం రోడ్‌లో కొలువైన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి అర్చకులు పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. బాలభోగనివేదన, నిత్యహోమ బలిహరణలు, రాజభోగము తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయంలో విష్ణుసహస్రనామ పారాయణ, నిత్యహోమ బలిహరణలు, కోలాటం జరిపారు. రాత్రి 8 గంటలకు రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారికి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వంచినట్లు ఈవో కొండలరావు తెలిపారు.

దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ

బుట్టాయగూడెం: రెడ్డిగణపవరంలో కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ, నూతన ఆలయ ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే పూర్ణాహుతి కార్యక్రమంతో పాటు రాత్రి ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

బుట్టాయగూడెం: ఎన్నికల కోడ్ నేపథ్యంలో బుట్టాయగూడెంలో వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. మండలంలోని పలు చోట్ల తనిఖీ బృందాలు క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీసులు, నోడల్ అధికారుల బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి శివాలయం వద్ద పోలీసులు, ఎన్నికల అధికారులు వాహనాలను తనిఖీ చేశారు.

అభివృద్ధి పథంలో జంగారెడ్డిగూడెం

- రూ.303.83 కోట్లు విలువైన సంక్షేమ పథకాలు ప్రజల చెంతకు
- డీబీటీ ద్వారా రూ.192.65 కోట్ల లబ్ధి
- నాన్ డీబీటీ ద్వారా రూ.111.15 కోట్ల లబ్ధి


జంగారెడ్డిగూడెంలో నిర్మించిన అర్బన్ పీహెచ్‌సీ

జంగారెడ్డిగూడెం: అభివృద్ధి అంటే మాటల్లో కాదు చేతల్లో చూపించాలని నిరూపించారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి ఐదేళ్లలో ప్రజారంజక పాలన అందించారు. ఒక పక్క అర్హులందరికీ సంక్షేమాన్ని అందిస్తూనే, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు ఎంత ప్రాధాన్యత ఇచ్చారో, పట్టణ ప్రాంతాలకు అంతే ప్రాధాన్యత కల్పించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలకు కోట్లాది రూపాయల సంక్షేమాన్ని కల్పిస్తూనే, పట్టణాలను సుందరంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన నిధులు మంజూరు చేశారు.

అల్పాదాయ వర్గాలవారే అధికం

జంగారెడ్డిగూడెం పట్టణం జనాభా సుమారు 70వేలు కాగా, పట్టణంలో నివసించే జనాభాలో ఎక్కువగా అల్పాదాయ వర్గాలకు చెందినవారే. జంగారెడ్డిగూడెం పట్టణానికి ఆనుకుని ఏజెన్సీ ప్రాంతం ఉండటంతో మెరుగైన ఉపాధి అవకాశాలు ఉన్న జంగారెడ్డిగూడెం వచ్చి ఇక్కడ స్థిరపడుతున్నారు. దీంతో పట్టణంలో ఎక్కువగా పేద, మధ్య తరగతి కుటుంబాలు కనిపిస్తున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జంగారెడ్డిగూడెం పట్టణంలో ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా రూ.192.65 కోట్ల నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. అలాగే పరోక్ష ప్రయోజనాల ద్వారా రూ.111.15 కోట్లు అందించారు. మొత్తంగా జంగారెడ్డిగూడెంలో రూ.303.83 కోట్లు విలువైన సంక్షేమ పథకాలు ప్రజల చెంతకు చేరాయి.

జన్మభూమి కమిటీలు కనికరిస్తేనే..

టీడీపీ పాలనలో జంగారెడ్డిగూడెం పట్టణంలో సంక్షేమ పథకాల అమలు అంతంత మాత్రంగానే జరిగాయి. అర్హత ఉన్నప్పటికీ ఏదో ఒక కొర్రీతో అనర్హులుగా ప్రకటించేవారు. జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకున్న వారినే అర్హులుగా గుర్తించి పథకాలు అందించే పరిస్థితి ఉండేది. ఈ నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేసి అర్హులను గుర్తించడంతో పాటు, వారికి అందించే సంక్షేమాన్ని పారదర్శకంగా అందించారు. వలంటీర్ ఇంటింటికి తిరుగుతూ వారికి అందుతున్న సంక్షేమ పథకాలు వివరాలు తెలుసుకుని, అర్హత ఉంటే అక్కడే వారిచేత దరఖాస్తు చేయించి ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందేలా చర్యలు తీసుకున్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

జంగారెడ్డిగూడెం పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఇప్పటికే పట్టణంలో రూ. 14కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. కాగా ఇటీవల రూ. 3.66కోట్లతో మరిన్ని కార్యక్రమాలకు జంగారెడ్డిగూడెం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కంభం విజయరాజు ఆధ్వర్యంలో శంకుస్థాపనలు నిర్వహించారు. వీటిలో 14 వార్డులకు మంచినీరు అందించేలా రూ.1.40కోట్లతో నిర్మించే వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

జంగారెడ్డిగూడెం పట్టణంలో సంక్షేమ పథకాల లబ్ధి ఇలా (డీబీటీ) ..

సంక్షేమ పథకం	లబ్ధిదారులు	మొత్తం (రూ.)
అమ్మ ఒడి	5326	23,22,99,834
జగనన్న విద్యా దీవెన	3165	11,56,70,108
జగనన్న వసతి దీవెన	2356	3,93,36,312
రైతు భరోసా	3166	14,16,82,050
ఉచిత పంట బీమా	291	53,39,799
సున్నా వడ్డీ పంట రుణాలు	889	27,76,068
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	179	16,33,181
మత్స్యకార భరోసా	5	1,00,000
వైఎస్సార్ పెన్షన్ కానుక	5864	56,41,89,000
వైఎస్సార్ చేయూత	2479	10,49,25,000
వైఎస్సార్ ఆసరా	7411	28,13,41,151
వైఎస్సార్ సున్నావడ్డీ	8923	3,77,05,396
వైఎస్సార్ కాపునేస్తం	624	2,47,05,000
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	409	1,08,30,000
కళ్యాణమస్తు	9	7,25,000
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	2317	10,23,83,463
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	1375	92,42,775
హౌసింగ్ డీబీటీ	1861	19,93,12,180
వైఎస్సార్ బీమా	151	2,01,44,999
వాహన మిత్ర	218	59,50,000
చేదోడు	616	1,99,20,000
కోవిడ్‌లో సహాయం	12,226	1,22,26,000
జగనన్న తోడు	559	1,38,784
మొత్తం	192,65,76,100	

పరోక్ష ప్రయోజనాల ద్వారా (నాన్ డీబీటీ)..

పథకాలు	లబ్ధిదారులు	మొత్తం (రూ.)
ఇళ్ల స్థలాలు	2885	70,97,10,000
విద్యాకానుక	2209	1,56,88,318
ట్యాబ్‌లు	332	43,89,704
జగనన్న తోడు (రుణాలు)	1319	2,45,58,461
గోరుముద్ద	2243	2,22,21,401
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	3015	5,64,70,950
బియ్యం కార్డులు	12760	27,87,29,440
మొత్తం		111,17,68,274

మళ్లీ జగనన్న సీఎం కావాలి



సంక్షేమ పథకాలన్నీ నేరుగా ఇంటికే వస్తున్నాయి. జగనన్న ప్రభుత్వంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా, దళారులు లేకుండా ఇంటికే సంక్షేమ పథకాలు అందుతున్నాయి. నాకు సున్నా వడ్డీ , అమ్మ ఒడి, జగనన్న ఇళ్ల కాలనీ పథకాలు లభించాయి. మళ్లీ జగనన్న సీఎంగా కావాలి.

– గేదెల దుర్గ, జంగారెడ్డిగూడెం

గతంలో సంక్షేమ పథకాలు వచ్చేవికావు



గతంలో సంక్షేమ పథకాలు అందాలంటే చాలా ప్రయాస పడాల్సి వచ్చేది. ప్రస్తుత ప్రభుత్వంలో సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా పథకాలు నేరుగా అందుతున్నాయి. నాకు వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ పథకాలు అందాయి. అర్హతను బట్టి సంక్షేమాన్ని అందిస్తున్న ఇటువంటి ప్రభుత్వమే మళ్లీ కొనసాగాలి.

– చల్లా లక్ష్మి, జంగారెడ్డిగూడెం

మహిళల అభివృద్ధికి పెద్దపీట వేశారు



పాలన అంటే ప్రజలకు మేలు చేసేదిగా ఉండాలి. ప్రజల అభివృద్ధితో పాటు, రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడాలి. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ దిశగానే పాలన అందించింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. ఆసరా, సున్నా వడ్డీ పథకాలను నేను ఎటువంటి ఇబ్బందులు లేకుండా పొందగలిగాను. రాష్ట్రానికి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ఉండాలి.

– గుత్తికొండ ధనలక్ష్మి, జంగారెడ్డిగూడెం


జంగారెడ్డిగూడెంలో నిర్మించిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం


జంగారెడ్డిగూడెంలో నిర్మించిన బాలల సత్వర చికిత్స కేంద్రం


నిర్మాణంలో ఉన్న మెటర్నిటీ అండ్ ఛైల్డ్ హెల్త్ సెంటర్


రూపుదిద్దుకుంటున్న జగనన్న కాలనీలు


జగనన్న కాలనీలోని ఓ ఇల్లు

సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌ను గెలిపించాలి


రాఘవాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ జానకిరెడ్డి, పార్టీ శ్రేణులు

చింతలపూడి: ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి అన్నారు. మండలంలోని రాఘవాపురం, పోతునూరు గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం మేము సిద్ధం, మా బూత్ సిద్ధం కార్యక్రమం బూత్ కన్వీనర్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జానకిరెడ్డి మాట్లాడుతూ సచివాలయాల స్థాపన ద్వారా గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకువచ్చారని కొనియాడారు. గ్రామంలోని ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబు అబద్ధపు హామీలను నమ్మవద్దని అన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజులను అత్యధిక మెజార్టీతో గెలిపించి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపుఇచ్చారు. కార్యక్రమంలో సిద్ధం ప్రోగ్రాం కోఆర్డినేటర్ శింగిరెడ్డి భరత్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గిరి భోగారావు, రాష్ట్ర యూత్ విభాగం ప్రధాన కార్యదర్శి కందుల దినేష్‌రెడ్డి, దాసు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


శింగగూడెం జెడ్పీ హైస్కూల్‌లో కలిసిన 1986-87 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

అ'పూర్వ' కలయిక

లింగపాలెం: శింగగూడెం జెడ్పీ హైస్కూల్‌లో 1986-87 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో జరిగింది. పూర్వ విద్యార్థులు ఆనాటి మధుర స్మృతులను నెమరువేసుకుని మిత్రులతో ఉల్లాసంగా గడిపారు. గురువులు కె అన్నమ్మ, వేణుగోపాలచారి తదితరులను సత్కరించుకున్నారు. గ్రామ సర్పంచ్ తగరం హేమలత జయరాజు దంపతులను సన్మానించారు. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ సహపంక్తి భోజనాలు చేశారు. హైస్కూల్ విడిచి 36 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించుకోవడం ప్రత్యేకత సంతరించుకోగా పూర్వ విద్యార్థి, సినీ దర్శకుడు వీఎన్ ఆదిత్య పాల్గొనడం కొసమెరుపు. ఆదిత్య మాట్లాడుతూ తాను ఈ హైస్కూల్‌లో 9, 10 తరగతులు అభ్యసించినట్లు చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఫలితం కోసం తొందరపడుతున్నారని, దీనివల్ల తాత్కాలిక ఆనందం ఉటుందని అన్నారు. యువత ఓపికగా ఉండి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పూర్వ విద్యార్థి ఏసీటీవో టీవీ నాగేశ్వరరావు, చెన్ను శ్రీనివాస్ యాదవ్, భీమిరెడ్డి స్వర్ణకుమారి, కొప్పుల వెంకటేశ్వరరావు, కట్టా నాగేంద్ర, మాడా కాంతరావు, గొళ్ల శ్రీనివాసరావు, ఎన్ ప్రభుదాసు, ఎస్ ప్రసాద్, ఎస్ సత్యన్నారాయణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం


ప్రకాష్ నగర్‌లో క్రైస్తవుల ప్రార్థనలు

టి.నరసాపురం: మట్టల ఆదివారాన్ని క్రైస్తవ విశ్వాసులు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మట్టలను చేతపట్టుకుని గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రజలందరూ శాంతి సమాధానాలతో వర్ధిల్లాలని ఫైర్ ప్రెయర్ టీం సభ్యులు జి.జ్ఞాన్ రాజు తెలిపారు. టి నరసాపురం పంచాయతీ ప్రకాష్‌నగర్‌లోని షాలేము ప్రార్థనా మందిరంలో మట్టల ఆదివారమును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో షాలేము, స్టీవెన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే టి.నరసాపురం, బొర్రంపాలెం, తెడ్లం, మక్కినవారిగూడెం, మర్రిగూడెం, పుట్రేపు తదితర గ్రామాల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

క్రీస్తు బోధనలు పాటించాలి

చింతలపూడి: సర్వ మానవాళి రక్షణార్థమై ఏసుక్రీస్తు లోక రక్షకుడిగా అవతరించాడని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. మండలంలోని యర్రంపల్లి గ్రామంలో ఆదివారం మట్టల ఆదివారం పండుగ సందర్భంగా స్థానిక చర్చిలో పాల్గొని ఆయన ఫాదర్ ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీస్తు బోధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్, రాష్ట్ర వైఎస్సార్ సీపీ కార్యదర్శి గోలి శరత్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కె దినేష్‌రెడ్డి, నాయకులు ఎస్ రమేష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఎం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడిలో...

చింతలపూడి బోయగూడెం ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం పండుగను ఘనంగా జరుపుకున్నారు. క్రైస్తవ భక్తులు, విశ్వాసులు మట్టలను చేతబూని బోయగూడెం నుంచి ఫైర్ స్టేషన్ మీదుగా పట్టణంలో సువార్త ప్రకటిస్తూ ర్యాలీ జరిపారు. ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద మానవహారంగా ఏర్పడి క్రీస్తు గొప్పదనాన్ని గురించి వివరించారు. కార్యక్రమంలో ఆర్‌సీఎం చర్చి ఫాదర్ కామా మాథ్యూ, క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.

పంగిడిగూడెంలో..

ద్వారకాతిరుమల: పంగిడిగూడెంలో ఆర్‌సీఎం దేవాలయము నందు మ్రానికొమ్మల ఆదివారం (మట్టల ఆదివారం)ప్రార్థనలు నిర్వహించారు. గుడ్ ఫ్రైడేకి ముందు వచ్చే ఆదివారాన్ని మ్రానికొమ్మల ఆదివారంగా పిలుస్తారు. ఈ సందర్భంగా భక్తులంతా మ్రాని కొమ్మలను చేతబూని యూదుల రాజా జయము హోసన్న హోసన్నా.. అంటూ పుర వీధుల్లో ఊరేగింపుగా తిరిగి దేవాలయానికి చేరుకున్నారు. అనంతరం గురువులు ఎరుపు రంగు దుస్తులు ధరించి ప్రార్థనలు జరిపారు. దైవ వాక్యాన్ని చదివారు. ఆ తరువాత విచారణ కర్త ఫాదర్ టోనీ మాట్లాడుతూ ఏసుక్రీస్తు మానవుల పాప పరిహారమే శిలువ వేయబడ్డాడని, ఆయన త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ అందరం మంచిగా జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ అరుణ్, పెద్దలు, విశ్వాసులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ క్రీస్తు మార్గంలో నడవాలి

కామవరపుకోట: ప్రతి మానవుడు క్రీస్తు అనుసరించిన సత్యం, ప్రేమ, కరుణ, త్యాగం పాటిస్తూ క్రీస్తు మార్గంలో నడవాలని రెవ. పీటర్ ప్రసాద్ అన్నారు. మండలంలో పలు చర్చిల్లో క్రైస్తవ విశ్వాసులు ఆదివారం మట్టలను చేత పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. స్థానిక రోమన్ క్యాథలిక్ మిషన్ సంఘ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొని చెక్ పోస్ట్ నుంచి చర్చి వరకు మట్టల చేత పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీటర్ ప్రసాద్ మానవుల పాపుల పరిహార్థమే ఏసుక్రీస్తు శిలువలో మరణించారని, ప్రతి మానవుడు క్రమశిక్షణతో ఏసుక్రీస్తు మార్గాన్ని అనుసరిస్తూ నడవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.


తెడ్లంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు


యర్రంపల్లి చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న విజయరాజు



పంగిడిగూడెంలో మ్రానికొమ్మలతో ర్యాలీ

నేటినుంచి కనకదుర్గమ్మ జాతర మహోత్సవాలు

- నియోజకవర్గంలో జరిగే అతి పెద్ద జాతర
- జాతరకు హాజరుకానున్న లక్షల్లో భక్తులు
- ఏర్పాట్లు చేసిన ఆలయ అభివృద్ధి కమిటీ




రెడ్డిరాజుల కాలంలో నిర్మించిన కల్యాణ మండపం, విశ్వేశ్వర స్వామి వారు


కనకదుర్గమ్మ తల్లి


అన్నపూర్ణా దేవి

బుట్టాయగూడెం: రెడ్డి రాజుల కాలం నుంచి ఏజెన్సీ ప్రాంతమైన రెడ్డిగణపవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ అన్నపూర్ణ విశ్వేశ్వర కనకదుర్గమ్మ భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పూజలందుకుంటోంది. 900 సంవత్సరాల క్రితం రెడ్డి రాజులు నిర్మించిన ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం హోలీ పూర్ణిమ నుంచి ఐదు రోజుల పాటు ఇక్కడ ఘనంగా ఉత్సవాలు జరుగుతాయి. ఏజెన్సీలో పలు గ్రామాల నుంచి వచ్చే ప్రజలే కాకుండా కృష్ణా, పశ్చిమ, తూర్పు, ఖమ్మం జిల్లాల భక్తుల ఆరాధ్య దైవంగా అమ్మవారు నీరాజనాలు అందుకుంటోంది. ఉత్సవాలు జరిగే ఐదు రోజులు సంతానం లేని వారు ఉపవాసంతో దుర్గమ్మను పూజిస్తే సంతానం కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారు. ఈ ఆలయాన్ని రెడ్డి రాజుల పాలనలో గణపతి రెడ్డి 1110వ సంవత్సరంలో నిర్మించారని, రెడ్డి రాజు గణపతిరెడ్డి దేవాలయాన్ని నిర్మించి పాలించడం వల్ల ఈ ప్రాంతానికి రెడ్డి గణపవరం అనే పేరు వచ్చిందని ఆలయ ధర్మ కర్త భౌమరాజు సత్యనారాయణరాజు తెలిపారు. గణపతి రెడ్డి తమ విజయాలకు గుర్తుగా ఈ ఆలయాన్ని నిర్మించారని, పాఠ్యాంశాలల్లో రెడ్డి రాజుల పాలన విషయాలు, దేవాలయ అంశం ఉందని ఆయన తెలిపారు. రెడ్డి రాజుల కాలంలో నిత్యం దూపదీప నైవేద్యాలతో భక్తుల నీరాజనాలు అందుకున్న దుర్గమ్మ దేవాలయం 1415వ సంవత్సరంలో జరిగిన ముస్లింల దండయాత్రలో పూర్తిగా ధ్వంసమైందని ధర్మకర్త తెలిపారు. 1925వ సంవత్సరంలో తమ పూర్వీకులు భౌమరాజు రామకృష్ణంరాజు శిథిలమైన ఈ దేవాలయాన్ని తిరిగి పునరుద్ధరించారని, ఆ నాటి నుంచి నేటివరకు హోలీ పూర్ణిమ రోజు నుంచి ఉత్సవాలు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతారు. అలాగే ఉత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఆలయ కమిటీ యువజన సంఘం ఆధ్వర్యంలో కమిటీలుగా ఏర్పడి పోలీసుల సహకారంతో చర్యలు చేపడతారు. ఈ ఉత్సవాలు ఈ నెల మార్చి 25 నుండి 29 వరకూ జరుగుతాయని ఆలయ ధర్మకర్త భౌమరాజు సత్యనారాయణరాజు తెలిపారు.

ఐదు రోజులపాటు ఉత్సవాలు



మార్చి 25వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఐదు రోజులపాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నాము. భక్తుల కోర్కెలు తీర్చే తల్లిగా కనకదుర్గమ్మ వారికి పేరు ఉండడంతో లక్షల్లో భక్తులు ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటారు. ఉత్సవాల్లో ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా పూర్తి ఏర్పాట్లు చేస్తున్నాము.

– భౌమరాజు సత్యనారాయణరాజు, ఆలయ ధర్మకర్త, రెడ్డి గణపవరం